క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మల్కాపురం: ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని, కనీస వసతులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని గాజువాక ఆర్టీసీ డిపో ఎస్‌ఎంయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. కార్మికులను గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన డిపో మేనేజర్ వేధింపులకు పాల్పడడం సరికాదని పేర్కొన్నారు. బస్సులు కండీషన్‌లో లేవని, ఇంధనం పొదుపు ఎలా సాధ్యమవుతుందో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 7,8వ తేదీల్లో ఎర్ర రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశామని, అయినా యాజమాన్యం స్పందించలేదన్నారు. అందుకే మళ్లీ ప్రింటెడ్ బ్యాడ్జిలతో గురువారం నిరసన వ్యక్తం చేశామన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కృష్ణకు మేయర్ పరామర్శ



కృష్ణ యోగక్షేమాలను తెలుసుకుంటున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య తండ్రి కృష్ణ అనారోగ్యం కారణంగా బాధపడుతున్న సంగతి తెలుసుకున్న నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, తన భర్త గొలగాని శ్రీనివాస్‌లు గురువారం పరామర్శించారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు,మహిళ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా శిక్షణలో పాల్గొన్న మహిళలు

మల్కాపురం : అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా పత్రీజీ పిరమిడ్ స్పెరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం సాయంత్రం యోగాలో ఉచిత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ ఎ.వి.విజయలక్ష్మి పలువురికి శిక్షణ ఇచ్చారు. అతిథులుగా పత్రీజీ పిరమిడ్ స్పెరిచ్యువల్ ట్రస్ట్ ప్రతినిధులు మీసాల శివగణేశ్వరరావు, సాయిబాబ పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధి గొందేశి పద్మావతి, సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ ఎస్.భాగ్యగౌరీ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



మంత్రపుష్ప పూజల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం బాబావారికి పంచామృతాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. సాయంత్రం బాబా వారికి పంచహారతులు ఇచ్చారు. భక్తులంతా సమాహికంగా సాయి సంకీర్తన ఆలపించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఒంటికి యోగా మంచిదేగా..

- శ్వాసమీద ధ్యాసతో ఎంతో ఉపశమనం
- యోగాతో సర్వరోగాల నివారణ సాధ్యం



యోగా శిక్షకురాలు పుష్పలత



యోగాసనాలు వేస్తున్న మహిళలు



యోగా సాధన చేస్తున్న మహిళ



విశాఖ విద్య: ఉరుకులు పరుగుల జీవనంలో ప్రతీ మనిషిని ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. సరైన ఆహార పద్ధతులు, వ్యాయామం లేకపోవడంతో పట్టుమని మూడు పదులు వయస్సు దాటకుండానే శారీరక అలసట, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రోజూ యోగతో పాటు కొద్దిసేపైనా ధ్యానం చేసినట్లెతై సర్వ రోగాలకు ఉపశమనం కలుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. కోవిడ్ విపత్తు తరువాత ప్రతీ ఒక్కరిలోనూ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే యోగా కేంద్రాలు అంతటా పెరిగాయి.

సీతారామరాజు పార్కులో ఉచిత శిక్షణ

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని సీతారామరాజు నగర్ పార్కులో పతంజలి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. పార్కులో రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7.30 వరకు ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నారు. దీనికి పరిశర కాలనీలకు చెందిన వారు 30 నుంచి 50 మంది వరకు పాల్గొంటున్నారు. యోగా గురువు నాగేశ్వరరావు పలు సూచనలు ఇస్తుండగా, యోగాలో ఎమ్మెస్సీ కోర్సు చేసిన ట్రైనర్ ఎస్. ఉష్పలత తన ప్రావీణ్యంతో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ఎక్కువగా మహిళలు, విద్యార్థులు సైతం యోగ శిక్షణపై ఆసక్తి చూపుతుండటంతో నిర్వాహకులు మరింత శ్రద్ధతో ఇక్కడ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

యోగా దినోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఏటా మాదిరే సీతారామరాజు నగర్ పార్కులో శుక్రవారం యోగ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యోగా ఆవశ్యకతను చాటిచెప్పేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పరిశర కాలనీల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా విస్తృత ప్రచారం చేశారు.

మండుతున్న ఎండలు



గొడుగు వేసుకుని వెళుతున్న మహిళ



ఎండ వేడికి గొడుగే ఆధారం

మల్కాపురం: రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తునే ఉన్నాడు. మూడు రోజుల నుంచి ఉదయం సమయంలో మేఘాలు కమ్ముకుంటున్నప్పటికీ వరుణుడు మొహం చాటేస్తున్నాడు. మధ్యాహ్నం వరకు ఎండ దంచికొడుతోంది. ఒక వైపు ఎండ వేడి, మరోవైపు ఉక్కబోతతో పారిశ్రామిక వాసులను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులతో ముఖ్యఅతిథులు, అంగన్‌వాడీ టీచర్లు

కంచరపాలెం: విశాఖ అర్బన్ సింహాచలం సెక్టార్ పరిధిలోని గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులను ఆహ్వానిస్తూ, ఐదేళ్లు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే క్రమంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించామని తెలిపారు. సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేరీ ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అంగన్‌వాడీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు టి. విజయలక్ష్మి, జి. జానకీ, కె.కృష్ణవేణి, డి.వరలక్ష్మి, టి.బుజ్జమ్మ, డి.నీలవేణి, ఆయాలు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



శ్యామ్‌ను ఇంటికి పంపిస్తున్న షెల్టర్‌మేనేజర్ మమత



గుజరాత్‌లోని తన కుటుంబ సభ్యుల చెంతన శ్యామ్

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడు ఎట్టకేలకు కుటుంబం చెంతకు చేరాడు. గుజరాత్‌లో ఉంటున్న తన కుటుంబ సభ్యుల వద్దకు గురువారం చేరుకున్నాడు. కొన్ని రోజుల క్రితం అనకాపల్లి పరిశర ప్రాంతాల్లో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న వృద్ధుడి సమాచారం తెలుసుకున్న షెల్టర్ మేనేజర్ మమత అతనికి ఆశ్రయం కల్పించారు. అతనికి నగరంలోని మానసిక ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందించటంతో కోలుకున్నాడు. తన పేరు శ్యామ్ అని, గుజరాత్ రాష్ట్రం అని చెప్పటంతో స్థానిక పోలీసుల సాయంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్థానిక శ్రద్ధ పౌండేషన్ సభ్యుల ద్వారా శ్యామ్‌ను గుజరాత్‌లోని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై అతని కుటుంబ సభ్యులు షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత, అదే విధంగా ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతులు తెలిపారు.

సన్యాసిరావుకు ఘన నివాళి



సన్యాసిరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సింథియా : మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పోతిన సన్యాసిరావు జయంతి వేడుకలు మల్కాపురంలోని త్రినాథపురం, చింతల్లోవ, యారాడ ప్రాంతాల్లో గురువారం నిర్వహించారు. పలుచోట్ల పోతిన సన్యాసిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టి, బోరాడ రామణరావు, నాగోతి అప్పారావు, బంక ప్రసాద్, గుజ్జారి సన్నియ్యపాత్రుడు, బంక అప్పారావు, సత్యాల అప్పారావు, రామ్, పిల్ల సతీష్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు బీసీజీ టీకాలు



జోగారావునగర్‌లో టీకా వేస్తున్న ఏఎన్ఎం

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా ప్రియాంక నేతృత్వంలో గురువారం వయోజనులకు బీసీజీ టీకాలు వేశారు. 55, 56 వార్డుల పరిధిలోని జోగారావునగర్, గాంధీనగర్, రెడ్డి కంచరపాలెం, జాషువానగర్, అశోక్‌నగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో వయోజనులకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ముందుగా సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, టీబీ సిబ్బందికి వ్యాక్సినేషన్‌పై డాక్టర్ ప్రియాంక అవగాహన కల్పించారు. బీసీజీ వ్యాక్సినేషన్ తరువాత, ఎవరికీ టీకాలు వేయాలి, ఎవరికీ వేయకూడదనే వాటిపై ఆమె పలు సూచనలిచ్చారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీ చేస్తున్న గోపాలపట్నం పోలీసులు

గోపాలపట్నం: వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్ మూలాలను అరికట్టేందుకు పోలీసుల చర్యలు ప్రారంభమయ్యాయి. ఉదయం సాయంత్రం వేళల్లో అవగాహన సదస్సులు, రాత్రి సమయాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు పోలీసులు సీఐ చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. బుధవారం రాత్రి కరాసా శ్మశాన వాటికలో, మాధవధార కొండవాలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఓపెన్ డ్రింకింగ్, గంజాయి తాగేవారిని చెదరగొట్టారు. అలాగే గురువారం సైతం ఎయిర్‌పోర్టు పోలీసులు మర్రిపాలెం రైల్వే స్టేషన్, కరాసా రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో గోపాలపట్నం రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. రోజూ తనిఖీలు నిర్వహిస్తామని, గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నవారు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: ప్రజావసరాల కోసమని చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులును గురువారం స్థానిక ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో శిథిలిమైన కల్వర్టు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు తన దృష్టికి తీసుకొచ్చిన మీదట, సమస్య పరిష్కరించేలా శ్రద్ధ తీసుకోవటం జరిగిందన్నారు. వార్డు పరిధిలోలని ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో జీవీఎంసీ 8 జోన్ ఏఈ వెంకటలక్ష్మి , వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ , వెంకటలక్ష్మి, జ్యోతి, రాధా కృష్ణ , లత, నూకరత్నం పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



హిందూస్తాన్ షిప్‌యార్డ్ అధికారులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సింథియా : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, కాలనీ వాసుల ఆరాధ్యదైవం, సింథియా మరిడిమాంబ అమ్మవారి మారువారం పండగ గురువారం కాలనీ వాస్తవ్యులు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యకమానికి హిందూస్తాన్ షిప్‌యార్డ్ సంస్థ సెక్యూర్టీ ఆఫీసర్ సునీల్‌కుమార్, హౌసింగ్ ఎస్టేట్ అధికారి సాజిత్, జి.ఎం.హెచ్ మెచ్చర్, ప్రొడక్షన్ జి.ఎం .గుప్త, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు జీఆర్‌కే రవి కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మారువారం పండగకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన . అతిథులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగనాయకులు, జోగారావు, అజయ్‌కుమార్, శరగడం సతీష్‌బాబు, నూకరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

హీరాచంద్ విగ్రహం సిద్ధం



వాల్ చంద్ హీరాచంద్ విగ్రహానికి రంగులు వేస్తున్న కార్మికులు

సింథియా: సింథియా జంక్షన్‌లో ఉన్న షిప్‌యార్డ్ వ్యవస్థాపకుడు వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహం పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విగ్రహానికి కొత్త రంగులతో నూతన కళను తీసుకొచ్చేందుకు కార్మికులు శ్రమిస్తున్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

కంచరపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ సూచనలతో కంచరపాలెం పోలీసులు గురువారం నేతాజీ కూడలి ముత్యమాంబ ఆలయం వద్ద ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, మహిళలపై నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత విశాఖగా పోలీసుల కృషిని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి విద్యనభ్యసించి సమాజానికి మేలు చేయాలని పిలుపునిచ్చారు. నేర సమస్యలు ఎదురైతే 100,112, 1930 నంబర్లు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, ఏసీపీ నరసింహమూర్తి, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.

షీలానగర్‌లో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 51వ శాఖను మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. షీలానగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా గల ఎంబీఆర్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడారు. 109 సంవత్సరాల చరిత్ర గల బ్యాంక్ ఎన్నో మైలురాళ్లను అధిగమించిందన్నారు. షీలానగర్‌లో కొత్త బ్రాంచ్ ఏర్పాటుతో స్థానికులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, మహారాజ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎం.ఆర్.కె.రాజు, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, వాణి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎం.వెంకటరత్నం, ఇన్నిస్ పేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్టార్ కో- ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, బ్యాంకు సీనియర్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కరరావు, సీఈవో పి.వి. నరసింహ మూర్తి, డైరెక్టర్లు స్టాలిన్, నాగభూషణ చౌదరి, కామరాజు, కాకి భవాని తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తితే పతనమే..



శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: కార్పొరేట్ శక్తుల అడుగులకు మడుగులొత్తితే ఏ దేశమైనా, రాష్ట్రమైనా, సంస్థ అయినా పతనం అంచుల్లోకి వెళ్లక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నేతృత్వంలో 1225వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి, ప్రజల ఆస్తులను బడా బాబులకు దోచిపట్టడం మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే పాలకులు కాలగర్భంలో కలిసిపోక తప్పదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థను నాశనం చేయాలనుకోవడం ఒక జాతిని నాశనం చేసుకోవడంతో సమానమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం దిగివచ్చి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, అయోధ్య రామ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

అగనంపూడి: విద్యార్థులు నీటిని పొదుపుగా వాడడంతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని పెదముషిడివాడ హైస్కూల్ హెచ్ఎం కృష్ణ సూచించారు. మిషన్ లైఫ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నీటి పరిరక్షణ చర్యలపై పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓ పక్క భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని.. మరోపక్క నీరు కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నీటిని కూడా కొనుక్కునే పరిస్థితి ఎదురవుతోందన్నారు. నీటిని వృథాగా పోనివ్వవద్దని, ఇంటి ఆవరణాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ టీచర్ సాయి లక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు పెద్దినాయుడు, సుధాకర్, పీడీ రమణ పాల్గొన్నారు.